క్లుప్తంగా

నేడు భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర



భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర గ్రామ శివారులోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఉదయం భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి పట్నం అనంతరం ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం, సాయంత్రం అగ్ని గుండాలు, బోనాల ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



అసిస్టెంట్ ప్రొఫెసర్ కుమారిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పటాన్‌చెరు టౌన్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరేట్ సాధించింది. శనివారం ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కళాశాలలో హిందీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న పూనం కుమారికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందన్నారు. 'సమకాలీన్ దళిత్ రచన కారోంకె కావ్యమే వ్యవస్థా కా విరోధ్' అంశంపై పరిశోధన చేసినట్లు తెలిపారు. ఆమెను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించి అభినందనలు తెలిపారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



జాతర ఏర్పాట్ల వివరాలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో శనివారం నుంచి ప్రారంభమైన శ్రీసోమేశ్వర స్వామి జాతరకు ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేటర్ పుష్ప నగేష్ తెలిపారు. సోమేశ్వర ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. జాతర మూడు రోజులపాటు జరుగుతుందన్నారు. ఆమె వెంట జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ క్రాంతి

నారాయణఖేడ్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం 2024 క్యాలెండర్‌ను కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆవిష్కరించినట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జట్ల భాస్కర్ శనివారం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు ప్రసాద్, వెంకటేశ్వర్లు, బలరాం, సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మామిడాల రవి కుమార్, అరిగే శ్రీనివాస్, న్యాలం శివకుమార్, ఆడేపు ఆంజనేయులు, కవి వేణుగోపాల్, రాజు, ఏక్‌నాథ్, ముత్యాల సాయిప్రసాద్, శివకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



సదాశివపేటలో అయ్యప్ప పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని సుభాష్‌రోడ్డులో అయ్యప్ప గురుస్వామి రాపోలు దత్తు ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప పడిపూజ వైభవంగా నిర్వహించారు. గోనె శంకర్ గురుస్వామి ఆధ్వర్యంలో భక్తబృందం కీర్తన ఆలపించారు. అంగరంగ వైభవంగా 18 మెట్ల పడిని వెలిగించారు. అయ్యప్ప నామస్మరణతో ఆ ప్రాంతం మారుమోగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

- ప్రజా పాలనలో ఎమ్మెల్యేలు
- ప్రభుత్వానికి తమవంతు సహకారం ఉంటుందని వెల్లడి



జానకంపేట గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నిర్దేశించిన గడువు లోగా ఆ హామీలను అమలు చేయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం జానకంపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతీ హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరు గ్యారంటీలతోపాటు మరో నాలుగు వందల ఇరవై హామీలను కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ప్రకటించిందని గుర్తు చేశారు. వంద రోజుల్లోగా ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రజల తరఫున ప్రశ్నిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, సర్పంచ్ పాండు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లో శనివారం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలో నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జంగంపేట గ్రామంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీఓ రాములు పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నిర్ణీత సమయంలో అమలు చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా శనివారం మండల పరిధిలోని అత్నూర్‌లో గ్రామసభ నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజలకు అందేలా చూడాలని అందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ప్రజల సంక్షేమమే తాము కోరుకుంటున్నామన్నారు. దరఖాస్తుల స్వీకరణ గడువు ఈనెల 6వ తేదీన ముగిసినందున ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సంబంధిత అధికారులకు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యం

నారాయణఖేడ్: అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో శనివారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సభలో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేట, నారాయణఖేడ్ రెండు కళ్లు అని నమ్మబలికి సిద్దిపేటకు రూ.కోట్ల నిధులు తరలించి ఖేడ్‌కు మొండిచేయి చూపాడన్నారు. తాము గత పాలకుల్లా కాకుండా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుబీనా నజీబ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాహెర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం కోసం ప్రజాపాలన

కల్హేర్(నారాయణఖేడ్): పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని ఏఓ శశాంక్ వెల్లడించారు. శనివారం సిర్గాపూర్ మండలం జమ్లా తండాలో ప్రజాపాలన సభ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దివ్యభారతి, పంచాయతీ కార్యదర్శి గౌతమి, బంజార సంఘం నాయకుడు చరణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేవిధంగా తన వంతు కృషి చేస్తానని కౌన్సిలర్ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి వెలిమెలలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేస్తాం

పటాన్‌చెరు: అర్హులకు న్యాయం చేస్తామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 21,22,23 వార్డులో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరకు బకాయి చెల్లించాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి

జహీరాబాద్ టౌన్: రైతులకు చెరకు బకాయి చెల్లించాలని, లేకుంటే వారి పక్షాన పోరాటం చేస్తామని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి యాదవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని హోతి(బి) గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రైడెంట్ చక్కెర కర్మాగార యాజమాన్యం గత ఏడాదికి సంబంధించి రూ.9 కోట్ల చెరకు బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. బకాయి చెల్లించకుండా యాజమాన్యం జాప్యం చేస్తోందని, బిల్లుల కోసం రైతులు ఆందోళనలు చేస్తున్నా స్పందించడంలేదన్నారు. ఈ ఏడాది క్రషింగ్ చేపట్టలేదన్నారు. ప్రభుత్వం యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి రైతులను ఆదుకోవాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతుబంధు విడుదల చేయాలని, పంటలకు బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి మెగా క్రికెట్ టోర్నీ



మెగా క్రికెట్ టోర్నీకి సిద్ధమైన బాగారెడ్డి స్టేడియం

జహీరాబాద్ టౌన్: ఈనెల 7 నుంచి జహీరాబాద్ బాగారెడ్డి స్టేడియంలో గోల్డ్ కప్ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పట్టణానికి చెందిన నాయకుడు కిజన్ యాఫై తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏటా పట్టణంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టోర్నీ ఈనెల 14 వరకు కొనసాగుతుందన్నారు. పోటీల్లో తెలంగాణ, ఢిల్లీ, జమ్ముకాశ్మీర్, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటున్నాయన్నారు. విజేత జట్టుకు రూ.5,55,555 లక్షలు, రన్నరప్‌కు రూ.3,33,333 లక్షల నగదు బహుమతితోపాటు ట్రోఫీ అందజేస్తామన్నారు. హైదరాబాద్‌కు చెందిన అంపైర్లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారని తెలిపారు. రంజీ క్రికెటర్లు వచ్చే అవకాశం ఉండటంతో పోటీలను తిలకించేందుకు క్రికెట్ అభిమానులు తరలి రానున్నందున స్టేడియం చుట్టూ ఇనుప గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు.

టీఎన్జీవోస్ అధ్యక్ష కార్యదర్శులకు సన్మానం



టీఎన్జీఓ నాయకులను సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

సంగారెడ్డి: 31 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు వచ్చేందుకు కృషి చేసినందుకు శనివారం టీఎన్జీఓ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు జావేద్ అలీ, కార్యదర్శి రవిని పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జావీద్ అలీ మాట్లాడారు. 31 మంది రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను ఇస్తూ, సర్వీస్ బ్రేక్ ఉన్న 37 మంది పంచాయతీ కార్యదర్శుల రెగ్యులరైజేషన్ కూడా వారంలోగా చేస్తామని హామీ ఇచ్చినందుకు డీపీఓ సురేష్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తెలంగాణ ఎన్జీవోస్ సంఘ అసోసియేట్ అధ్యక్షులు శ్రీకాంత్, పి.వెంకట్ రెడ్డి, కోశాధికారి జి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వరకాల విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ నియోజకవర్గ సరిహద్దులోని కామారెడ్డి జిల్లా పిట్లం మండలం కుర్తికి తొలిసారి వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఘన స్వాగతం లభించింది. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికినవారిలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, ఖేడ్ కాంగ్రెస్ నాయకులు నరేష్‌యాదవ్, పండరిరెడ్డి, బాణాపురం రాజు పాల్గొన్నారు

బీమా చెక్కు పంపిణీ

పెద్దశంకరంపేట మండలం మల్కాపూర్‌కు చెందిన కుమ్మరి సత్యనారాయణ మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం రూ.5 లక్షల రైతుబీమా చెక్కురూపంలో విడుదల చేసింది. ఆ చెక్కును మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్, నాయకులు ఉన్నారు.

కాలుష్య కారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

పటాన్‌చెరు టౌన్: కాలుష్య కారక కంపెనీలపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పటాన్‌చెరు శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాలుష్య కారక కంపెనీలపై తక్షణమే చర్యలు తీసుకొని, కాలుష్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు ప్రాంతంలో కాలుష్య జలాలతో చెరువులు, కుంటలు, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, దీంతో పంటలు దెబ్బతింటున్నాయన్నారు. అంతేకాకుండా ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. వాయు కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

మానవాళికి శ్రీరాముడు ఆదర్శం



శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర నిర్వహిస్తున్న నీలం మధు, నాయకులు



అక్షింతలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి

ఎస్ఎంఆర్ యువసేన వ్యవస్థాపకుడు నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: శ్రీరాముని జీవితం మానవాళికి ఆదర్శమని ఎస్ఎంఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం చిట్కుల్ గ్రామంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను గడపగడపకు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయోధ్యలో ఈనెల 22వ తేదీన రామ మందిర ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అందులో భాగంగా అక్షింతలను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, భక్తులు, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలోని ముంబై కాలనీలో శనివారం అయోధ్య శ్రీరాముని అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి భక్తులకు అక్షింతలను పంపిణీ చేశారు. అనంతరం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆలయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

అక్షింతల పంపిణీ

జిన్నారం(పటాన్‌చెరు): అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. జిన్నారంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పంపిణీ చేశారు. స్వామివారి అక్షింతలు ఇంటికి రావటం సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

సంగారెడ్డి టౌన్: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వల్లూరు క్రాంతి శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అలాగే కలెక్టర్‌ను జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ. కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



పూలమొక్క అందజేస్తున్న కలెక్టర్ క్రాంతి

ఉపగ్రహ ప్రయోగంపై అవగాహన



ఉపగ్రహ ప్రయోగాన్ని వివరిస్తున్న ఇంజనీర్ రఘువర్మ

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం ఉపగ్రహ ప్రయోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని బాలానగర్ నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ఇంజనీర్ రఘువర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉపగ్రహ ప్రయోగంలో వాడే గణిత ఫార్ములా, అక్షాంశాలు, రేఖాంశాలు ద్వారా ఉపగ్రహాలను రాకెట్ ద్వారా ఛాయా చిత్రాలు తీసేవిధానం తదితర విషయాలను వివరించారు. గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్స్ జమీల్, రాములు, ఇంజనీర్ రఘువర్మను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగార్జున, ఇర్ఫాన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మల్లికార్జున స్వామి జాతర

కోహీర్(జహీరాబాద్): మండలంలోని గోడిగార్‌పల్లి గ్రామం మందగడ్డపై కొలువైన శ్రీమల్లికార్జున స్వామి జాతర రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు అర్చనలు, సాయంత్రం ధ్వజారోహణం, శిఖర పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు బోనాలు సమర్పిస్తారు. సోమవారం మధ్యాహ్నం 1 గంటకు స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం 2 గంటలకు అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు బండ్ల ప్రదక్షిణలు, స్వామివారి సర్వదర్శనం ఉంటుంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు.

భారత్ వికసిత్ సంకల్ప యాత్ర

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ, చల్మెగ గ్రామాల్లో శనివారం భారత్ వికసిత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ముద్ర, విశ్వకర్మ కౌశల్ యోజన తదితర రుణాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు లద్ద ప్రీతి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీలు సురేశ్, బాల్‌రెడ్డి, సెక్రటరీలు ఆరిఫ్ హుస్సేన్, నర్సింహారెడ్డి, ఇన్‌చార్జి నోడల్ ఆఫీసర్ భాస్కర్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, రమేశ్, ఇతర నాయకులు పాల్గొన్నారు. పేదలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని అధికారులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉచిత వైద్యశిబిరం

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండాలో హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో ఉచిత వైద్యం నిర్వహించినట్లు నిర్వాహకుడు సాంబరాజు శనివారం తెలిపారు. ఐలాపూర్, ఐలాపూర్ తండాలో వంద మందికిపైగా ఉచిత వైద్య పరీక్షలు చేశారని, అవసరమైన వారికి మాత్రలు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

◆ దరఖాస్తుకు గడువు పొడిగింపు

జహీరాబాద్ టౌన్: 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువు ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రాంతీయ పర్యవేక్షకుడు భీమయ్య శనివారం తెలిపారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో చేయాలని సూచించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రవేశాలకు అర్హులన్నారు. ఫిబ్రవరి 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారని, పూర్తి వివరాలకు 1800 4254 5678 టోల్ ఫ్రీ నంబర్లో సంప్రదించాలన్నారు.

◆ ఆహ్వానం

నారాయణఖేడ్: భూంగొండేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను శనివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి నిర్వాహకులు ఆవిష్కరించారు. ఆదివారం నిర్వహించే వేడుకల్లో పాల్గొనాలని సంఘం బాధ్యులు గోపాల్, సంజీవ్, అంజయ్య, మల్గొండ కోరారు.

◆ దరఖాస్తుల స్వీకరణ పూర్తి

రాయికోడ్(అందోల్): ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ పూర్తయినట్లు ఎంపీడీఓ వెంకటేశం శనివారం తెలిపారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన గ్రామసభల్లో అభయహస్తం ఆరు గ్యారంటీలకు 10,902 దరఖాస్తులు వచ్చాయన్నారు. 2,100 దరఖాస్తులు కొత్త రేషన్ కార్డుల మంజూరు, భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చినట్లు వివరించారు. దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

◆ 9న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ సుజాత శనివారం తెలిపారు. ఉపాధి హామీ పనుల వివరాలు డీఆర్‌పీలు ప్రజావేదికలో తెలియజేస్తారన్నారు.

◆ నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జహీరాబాద్ టౌన్: 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో డీఈఈ శనివారం తెలిపారు. మొగుడంపల్లి, ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్, రాయికోడ్ మండలాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలన్నారు.

◆ ఉన్నత విద్యా బోధనను రద్దు చేయాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో అమలులో ఉన్న ఉన్నత, ఎఫ్ఎల్ఎన్ విద్యా బోధనను రద్దుచేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో అధికారులు, ఉపాధ్యాయులతో కలిసి ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వమైనా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను సంక్రాంతి పండగలోపు అందించాలన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ప్రధానమైన సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ మన్నన్, మిర్జాపల్లి, సూరారం, చందంపేట జెడ్పీహెచ్ఎంలు పుష్పవేణి, సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, జబ్బార్, గోపాల్, జహిరొద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ



వివరాలను నమోదు చేస్తున్న ఆపరేటర్లు

కంది(సంగారెడ్డి): ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం ముగిసింది. జనవరి 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 6 వరకు దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో మొత్తం 12,165 దరఖాస్తులు రాగా వాటిలో రేషన్ కార్డుల కోసం 2500 వచ్చినట్లు ఎంపీఓ మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రతీ దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి కంప్యూటర్లలో నమోదు చేయనున్నట్లు చెప్పారు. రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్ కార్యాలయానికి పంపినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు.

సదాశివపేట(సంగారెడ్డి): ప్రజాపాలన కార్యక్రమం శనివారం పట్టణంలోని 23, 24, 25, 26 వార్డుల్లో నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీఓ భాస్కర్‌గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి, కౌన్సిలర్లు అపర్ణపాటిల్, ఇంద్రమోహన్‌గౌడ్, ప్రసన్నశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.